బీసీలు విదేశీ విద్యకు దరఖాస్తు చేసుకోవాలి

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 8: మహాత్మాజ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి (బీసీ ఓవర్సీస్) పథకం కింద హనుమకొండ జిల్లాలోని బీసీ, ఈబీసీ విద్యార్థులు ఈనెల 30న సాయంత్రం 6 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ జిల్లా ఉప సంచాలకులు జి.రాంరెడ్డి తెలిపారు. విద్యార్థులు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మంటలు అంటుకొని 1500 కోళ్లు మృత్యువాత

శాయంపేట, ఏప్రిల్ 8 : కోళ్ల ఫామ్‌కు మంటలు అంటుకొని 1500 కోళ్లు మృత్యువాత పడిన ఘటన మండలంలోని ఆరెపల్లిలో మంగళవారం జరిగింది. ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుంపల రాజిరెడ్డి తన భూమిలో ఎండిన చొప్పను కాలబెట్టగా, పక్కనున్న పరకాల రాజేందర్‌కు చెందిన కోళ్ల ఫారంలోకి మంటలు వ్యాపించాయి. ఫామ్‌లోని సుమారు 1500 కోళ్లు మంట తగిలి మృతిచెందాయి. వాటి విలువ సుమారు రూ.4.50లక్షలు ఉంటుంది. కావాలనే దుంపల రాజిరెడ్డి తన ఫామ్ పక్కన ఎండిన చొప్ప తగలబెట్టి మంటలు అంటుకునేలా చేశాడని యజమాని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రాజిరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బైక్ సీటు కింద గంజాయి

300 గ్రాములు పట్టుకున్న పోలీసులు

హసన్‌పర్తి, ఏప్రిల్ 8: బైక్ సీటు కింద 300 గ్రాముల గంజాయి పెట్టుకొని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం 10గంటలకు ఎస్సై సిద్దయ్య పోలీస్ సిబ్బందితో వంగపాడు నుంచి కొత్తపల్లి వరకు పెట్రోలింగ్ నిర్వహించి, గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. రెండు బైక్‌లపై వెళ్తున్న మల్లారెడ్డిపల్లికి చెందిన కేతపాక సాయి, కొగిల్వాయికి చెందిన చుక్క చందు, మల్లారెడ్డిపల్లికి చెందిన జూపాక సుశాంత్, కేతపాక చందు పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. బైక్‌లను తనిఖీ చేయగా సీటు కింద 300 గ్రాముల గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. విచారించగా కంఠాత్మకూరుకు చెందిన సిద్దు వద్ద కొనుగోలు చేసి కొంత విక్రయించి మిగతాది సేవిస్తున్నట్లు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని బైక్‌లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

పరకాల, ఏప్రిల్ 8: మున్సిపాలిటీలో ఫైల్స్ మాయం ఘటనలో ఇద్దరు ఉద్యోగులు రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (ఆర్డీఎంఏ) సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇటీవల మున్సిపాలిటీలో ఫైళ్ల మాయంపై మున్సిపల్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ వెంకటరెడ్డితోపాటు రికార్డ్ రూమ్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌ను ఆర్డీఎంఏకు అటాచ్ చేయడంతోపాటు అసిస్టెంట్ ఇంజినీర్ రంజిత్ ఆధ్వర్యంలో అంతర్గత విచారణ చేపట్టారు. ఏఈ రిపోర్ట్ మేరకు వారిని సస్పెండ్ చేస్తూ ఆర్డీఎంఏ ఉత్తర్వులు జారీ చేశారు.

వార్డు అధికారులకు అందని వేతనాలు

- ఉద్యోగంలో చేరి మూడు నెలలు
- ఇంకా వేతనాలు చేయని బల్దియా

వరంగల్, ఏప్రిల్ 8: ఉద్యోగం చేరి మూడు నెలలవుతున్నా వార్డు అధికారులు మొదటి వేతనం తీసుకోలేదు. బల్దియాలో వార్డు అధికారులుగా 29 మంది, జూనియర్ అకౌంట్ అధికారులుగా నలుగురు, జూనియర్ అసిస్టెంట్‌గా ఒకరు జనవరిలో ఉద్యోగంలో చేరారు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని, నెలనెలా వేతనం కంచనుగా వస్తుందని సంబురపడ్డ వారికి మూడు నెలలవుతున్నా చేతికి వేతనం రాలేదు. దీనిపై బల్దియా సాధారణ పరిపాలన విభాగంలో అడిగితే ఈ నెలలో వస్తుందిలే! అంటున్నారని చెబుతున్నట్లు వార్డు అధికారులు చెబుతున్నారు.

ఎల్ఆర్ఎస్, పన్నుల వసూళ్లలో కీలకం

ఎల్ఆర్ఎస్‌లో దరఖాస్తుల పరిశీలన, పన్నుల వసూళ్లలో వార్డు అధికారులు కీలకంగా పనిచేశారు. పన్నుల వసూళ్లలో టార్గెట్లు విధించడంతో కొత్తగా ఉద్యోగంలో చేరిన వార్డు అధికారులు భయంతో వణికిపోయారు. అర్ధరాత్రి వరకు పన్నుల వసూళ్ల పనిలో నిమగ్నమై లక్ష్యాలను చేరుకున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వీరిని వినియోగించుకన్నారు. మూడు నెలల ఉద్యోగ పని ఒత్తిడిలో అతలాకుతలం అయ్యారు. కానీ వీరికి వేతనాలు అందకపోవడంతో సంతోషం లేకుండా పోయింది. వారంతా యువ రక్తం కావడంతో ఉత్సాహంగా విధులు నిర్వర్తించారు. కానీ తొలి వేతనాన్ని కూడా అందుకోకుండా మూడు నెలలుగా వేచి చూస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంకా జీతాలు చేయని బల్దియా

బల్దియాలో వార్డు అధికారుల వేతానాలు సాధారణ పరిపాలన విభాగం సిబ్బంది ఇంకా చేయనే లేదు. మొత్తం 35 మంది ఉద్యోగులకు సంబంధించిన వేతనాలను మాన్యువల్‌గా చేసి డీటీవో కార్యాలయానికి పంపామని సిబ్బంది చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో ఇద్దరి ఉద్యోగుల వివరాలు సాంకేతిక కారణాలతో తప్పుగా పడ్డాయని, వాటిని సరిచేసిన తర్వాత కొత్తగా చేరిన 35మంది ఉద్యోగుల వేతనాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని చెబుతున్నారు. ఉద్యోగాలు వచ్చిన వారు దఫాల వారీగా జాయిన్ అయ్యారని, అందుకే వేతనాలు ఆలస్యమయ్యాయని అంటున్నారు. కొత్తగా చేరిన వారందరి వేతనాలు ఒకేసారి చేయాల్సి ఉంటుందని, అందుకే ఇప్పటివరకు వేతనాలు చేయలేదని అంటున్నారు. ఈ నెలలో వేతనాలు చేసి పంపుతామని తెలుపుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు చురుగ్గా నిర్మించుకోవాలి

కలెక్టర్ ప్రావీణ్య

ఆసరా స్టోర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హసన్‌పర్తి, ఏప్రిల్ 8: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణ పనులు చురుగ్గా చేపట్టాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మండలంలోని పెంబర్తిలో సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అధికారులతో కలిసి కలెక్టర్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు దశల వారీగా లబ్ధిదారులకు చెల్లింపులవుతాయని తెలిపారు. రేషన్ షాపును సందర్శించి సన్న బియ్యం ఎంత మందికి పంపిణీ చేశారని, ఇంకా ఎంతమందికి చేయాలని డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు. కాగా, గ్రేటర్ 2వ డివిజన్ వంగపహాడ్‌లో ఆసరా స్టోర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, జీఎం ఇండస్ట్రీస్ నవీన్‌కుమార్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి బాలరాజు, జయంతి, ఓమిని మార్ట్ ఎండీ రాజేశ్, తహసీల్దార్ చల్లా ప్రసాద్, ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, తాళ్లపెల్లి రమేశ్ పాల్గొన్నారు.

సమ్మర్ కోచింగ్ క్యాంపులను వినియోగించుకోవాలి

జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో మేలో నిర్వహించే సమ్మర్ కోచింగ్ క్యాంపులను వినియోగించుకోవాలని కలెక్టర్ పీ ప్రావీణ్య తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పలు క్రీడాంశాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి 25 వరకు నగరంలోని ఔత్సాహిక క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ అజీజ్‌ఖాన్, జిల్లా క్రీడలు యువజన శాఖ అధికారి గుగులోతు అశోక్ కుమార్ మాట్లాడారు. ఈనెల 25వ తేదీలోగా హనుమకొండ జేఎన్ఎస్‌లోని కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వైవీ గణేశ్, డీఈఓ వాసంతి, సీఎం హెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్, రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు శ్యామల పవన్‌కుమార్, మహమ్మద్ కరీం, క్రీడా సంఘాల బాధ్యులు పింగిలి రమేశ్‌రెడ్డి, తోట శ్యామ్‌ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, దస్రునాయక్, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, ఏప్రిల్ 8: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఆపరేషన్ డీఈ జీ సాంబరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా బుధవారం ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు టీచర్స్ కాలనీ, బ్యాంకుకాలనీ, చైతన్యపురికాలనీ, ప్రశాంత్‌నగర్, శాయంపేట సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4గంటల వరకు ప్రకాశ్‌రెడ్డిపేట, పోస్టల్‌కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, విద్యుత్‌నగర్, నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు గోకుల్‌నగర్, అంబేద్కర్ భవన్ ఏరియా, అశోకాలనీ, వికాస్‌నగర్, గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు కల్లుమండువ జంక్షన్, ఎఫ్‌సీఐ కాలనీ, శివసాయి కాలనీ, విద్యార్థి స్కూల్, వెంకటేశ్వరకాలనీ, అరుణోదయ కాలనీ, బృందావనం కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు.

20 నుంచి ఓపెన్ స్కూల్ ఎగ్జామ్స్

హనుమకొండ, ఏప్రిల్ 8: ఈనెల 20వ తేదీ నుంచి ఓపెన్ స్కూల్ ఎగ్జామ్స్ నిర్వహించనున్నట్లు డీఆర్వో వైవీ గణేశ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డీఆర్వో చాంబర్‌లో ఓపెన్ స్కూల్ కోఆర్డినేషన్ మీటింగ్ డీఈవో వాసంతి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అనగోని సదానందం ఆధ్వర్యంలో లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సమావేశం జరిగింది. డీఈవో మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ ఎగ్జామ్స్ ఈనెల 20వ తేదీ నుంచి 26 వరకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరుగుతాయని తెలిపారు. ప్రాక్టికల్ ఎగ్జామ్స్ 26వ తేదీ నుంచి మే 3వ తేదీ వరకు ఉంటాయని చెప్పారు.

నేలవాలిన మక్కజొన్న

శాయంపేట, ఏప్రిల్ 8: మండలంలోని పలు గ్రామాల్లో వరి, మక్కజొన్న పంటలు ఈదురుగాలులకు నేలవాలాయి. గంగిరెనిగూడెంలో నాసర్ మహమ్మద్ రెండు ఎకరాల్లో మక్కజొన్న పంట వేశాడు. కంకులు కాసి కొద్దిరోజుల్లో చేతికి వచ్చే దశలో సోమవారం రాత్రి ఈదురుగాలులు, అకాల వర్షానికి పంట నేలవాలింది.

రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో తరలాలి

సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

పరకాల, ఏప్రిల్ 8: ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలం నుంచి భారీ సంఖ్యలో తరలాలని పార్టీ మండల అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్నందున ఈ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గం నుంచి 25వేల మంది తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేశారని, అందులో భాగంగా మండలంలో ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బండి సారంగపాణి, గంట సమ్మిరెడ్డి, ఆముదాలపల్లి అశోక్, మునిగాల సురేందర్‌రావు, విద్యాసాగర్‌రావు, శ్రీనివాస్, సింగాడి రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా కాలేజీ పూర్వవిద్యార్థుల పోస్టర్ ఆవిష్కరణ

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 8: కాకతీయ యూనివర్సిటీ మహిళా కాలేజీలో ఈ నెల 17న జరిగే పూర్వవిద్యార్థుల సమ్మేళనం పోస్టర్‌ను కేయూ వీసీ ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం మంగళవారం ఆవిష్కరించారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలను 2012-2013 విద్యాసంవత్సరంలో ప్రారంభించగా పదేళ్లలో 3వేల మంది విద్యార్థినులు పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.మధుశ్రీ తెలిపారు. 400 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. కాలేజీ అధ్యాపకులు కే భాగ్యలక్ష్మి, కే కవిత, ఏ రవీందర్, అన్నపూర్ణ, విద్యార్థులు సమ్రీన్ (పొలిటికల్ సైన్స్) సౌమిత (ఎంసీఏ), సాహితీ (ఎంసీఏ) పాల్గొన్నారు.

ఆరుగురు గంజాయి నిందితుల అరెస్ట్

సుబేదారి, ఏప్రిల్ 8: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరితోపాటు కొనుగోలు చేసి సేవిస్తున్న బాలుడితో సహా ఆరుగురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సుమారు 180 గ్రాముల గంజాయితోపాటు సెల్‌ఫోన్, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం హనుమకొండ పోలీసు స్టేషన్‌లో ఆరుగురు నిందితులను ఏసీపీ కే దేవేందర్‌రెడ్డి అరెస్ట్ చూపి, వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి జిల్లాకు చెందిన మోతే మణికంఠ, కోటగిరి రోహిత్ సులభంగా డబ్బు సంపాదించేందుకు బైక్‌పై ఒడిషా రాష్ట్రం కల్మీల గ్రామానికి వెళ్లి నాగరాజు వద్ద అర కిలో గంజాయి కొనుగోలు చేశారు. అందులో కొంత రోహిత్ తీసుకున్నాడు. మిగతాది మోతే మణికంఠ సోమవారం విక్రయించేందుకు హనుమకొండకు తీసుకువచ్చాడు. హనుమకొండ పోలీసులకు అందిన సమాచారం మేరకు మణికంఠను అదుపులో తీసుకొని బ్యాగ్ తనిఖీ చేయగా గంజాయి లభ్యమైనది. అతడిని విచారించి, గంజాయి వియ్రించిన రోహిత్‌తోపాటు గంజాయి కొనుగోలు చేసిన బాలుడితోపాటు మేకల అవినాశ్, శనిగరపు అభిలాష్, కాంతాల రాజిరెడ్డి, ఓదెల అరుణ్‌ను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు ఒడిషాకు చెందిన నాగరాజుతోపాటు వడ్డపల్లికి చెందిన తాళ్లపెల్లి చిన్ను పరారీలో ఉన్నారు. నిందితులను పట్టుకోవడం ప్రతిభ కనబరిచిన హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఎస్సై పరశురాములు, అడ్మిన్ అశోక్‌కుమార్, కానిస్టేబుల్ అనిల్, సతీష్, కిరణ్‌ను ఏసీపీ అభినందించారు.

51ఏళ్ల తర్వాత కలుసుకున్నారు

న్యూశాయంపేట, ఏప్రిల్ 8 : వరంగల్ జిల్లా నెక్కొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1973-74 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం హనుమకొండ హంటర్ రోడ్డులోని లోటస్ రెసిడెన్సీలో మంగళవారం ఘనంగా జరిగింది. 51ఏళ్ల తర్వాత అందరూ ఒకచోట కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. మెమొంటోలు, శాలువాలతో ఘనంగా సత్కరించుకున్నారు. అధ్యక్షత వహించిన కన్వీనర్, రిటైర్డ్ డిప్యూటీ డీఈవో తోట రవీందర్ మాట్లాడుతూ మిత్రులందరం ట్రస్టు ఏర్పాటు చేసుకుని నిరుపేద మిత్రులకు సాయం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పూర్వవిద్యార్థులు డి.లక్ష్మణాచారి, ఎండీ సాజిద్‌అలీ, వాసుదేవరావు (సినీ ఇండస్ట్రీ ఫొటోఫ్లాష్, చెన్నై), ఎస్సై రామారావు, ఎన్.నాగేశ్వర్‌రావు, సీహెచ్.విజయలక్ష్మి, ఏ.వీరారెడ్డి, అబ్దుల్‌బారి, బొల్లం సాంబయ్య, సంజీవరెడ్డి, వెంగళచారి, శ్రీమన్నారాయణ, వెంకటాచారి, సింగర్ మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

ఎల్కతుర్తి, ఏప్రిల్ 8: అత్త, భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని సూరారంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్ మండలం దేశరాజుపల్లికి చెందిన శ్రీరామోజు రమేసాచారికి కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణానికి చెందిన హిమబిందు(36)తో పదహారేళ్ల క్రితం వివాహమైంది. ఎల్కతుర్తి మండలం సూరారంలో గోల్డ్‌స్మిత్ పనులు చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. కుమారుడు, కుమార్తె ఉన్నారు. అత్త లక్ష్మి, భర్త రమేశ్ ఆమెను వేధింపులకు గురిచేసేవారు. వేధింపులు భరించలేక మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి పంచకోటి సదానందచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అక్కెనపెల్లి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం హుజురాబాద్ సివిల్ ఆస్పత్రికి తరలించారు.

ఐటీఐలో ప్రైవేట్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

కాజీపేట, ఏప్రిల్ 8: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న కార్మికులు ప్రైవేట్‌గా ఐటీఐ చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కాజీపేట ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు మంగళవారం సూచించారు. కేంద్ర, రాష్ట్ర పరిధి పరిశ్రమల్లో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసిన అభ్యర్థులు ప్రైవేట్‌గా ఐటీఐలో శిక్షణ పొందేందుకు వరంగల్ ఆర్‌డీడీ కార్యాలయంలో ఈనెల 12లోగా ఉద్యోగ ఐడీ, ఆధార్ కార్డు, ఇతర జిరాక్స్‌లు, డ్రాయింగ్ అధికారితో సర్టిఫైడ్ చేయించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ రైల్వే, ప్రభుత్వ, ప్రభుత్వేతర సెక్టార్లలో పనిచేసే వారు ప్రమోషన్లు పొందేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

కోర్టుకు హాజరుకాని వ్యక్తికి రిమాండ్

శాయంపేట, ఏప్రిల్ 8 : కోర్టుకు సక్రమంగా హాజరుకాని నిందితుడికి పరకాల మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు ఎస్సై పరమేశ్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన వడ్డెపెల్లి మహేందర్ 2022 సంవత్సరంలో భార్యతో గొడవపడగా నాటి పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడు కోర్టుకు హాజరుకాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్ ఇవ్వగా అరెస్ట్ చేసి మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ మేరకు మేజిస్ట్రేట్ మహేందర్‌కు 14రోజులు రిమాండ్ విధించినట్లు వివరించారు.

పెంచిన పెట్రో ధరలను తగ్గించాలి

కాజీపేట, ఏప్రిల్ 8: పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకుడు ఓరుగంటి సాంబయ్య డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచినందుకు నిరసనగా సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముడి, చమురు ధరలు పెరగకపోయినా కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారం వేస్తోందన్నారు. ధరలు పెంపుతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెంచిన ధరలను ఉప సహరించుకోవాలని, లేకుంటే ఆందోళనలు, పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీ నాయకులు జంపాల రమేశ్, సంటి రవి, రామంచ సారంగపాణి, పాల్ పీటర్, ప్రశాంత్, మాట్ల పోచయ్య పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేయాలి

పరకాల, ఏప్రిల్ 8: తమ పంట పొలాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేయాలని గ్రీన్ ఫీల్డ్ హైవే బాధితులు తహసీల్దార్ విజయలక్ష్మికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ తమ పొలాలు గ్రీన్ ఫీల్డ్ హైవేలో కోల్పోగా, మిగతా కొద్ది పొలాల వద్దకు వెళ్లేందుకు అధికారులు ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేయాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి, రైతు గంట సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రగతిచక్ర అవార్డులు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 8: వరంగల్ రీజియన్‌లో అక్టోబర్, నవంబర్, డిసెంబర్ త్రైమాసికంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను గౌరవిస్తూ 'ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవం వరంగల్-1 డిపోలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రీజినల్ మేనేజర్ డి.విజయభాను పాల్గొని అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఆర్ఎం మాట్లాడుతూ ట్రాఫిక్ రద్దీలోనూ సిబ్బంది సమర్థంగా పనిచేస్తూ ప్రయాణికుల సురక్షిత రవాణా కోసం అంకితభావంతో కృషి చేస్తున్నారని, ఇదే ఉత్సాహంతో ముందుకుసాగాలని కాంక్షించారు. డిప్యూటీ ఆర్ఎంఓ కేశరాజు భానుకిరణ్, డిప్యూటీ ఆర్ఎం మహేశ్, ఏఓ, పీఓ, 9 డిపోల డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జీవో 21ని వెంటనే రద్దు చేయాలి

ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 8: రాష్ట్ర ప్రభుత్వం తమను పర్మనెంట్ చేయాలని, ఈనెల 4న విడుదల చేసిన జీవో 21ని రద్దు చేయాలని కాంట్రాక్ట్ అధ్యాపకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు తరగతులను బహిష్కరించి కాకతీయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర నాయకులు కర్ణాకర్‌రావు, శ్రీధర్‌లోథ్‌కుమార్, కనకయ్య మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1,270 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని గతంలో పలుమార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీమేరకు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 4న రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ విడుదల చేసిన జీవో 21 ఒప్పంద అధ్యాపకులకు ఎలాంటి లాభం చేకూర్చేలా లేదని, వెంటనే జీవోను రద్దుచేయాలని కోరారు. కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. కేయూ ఒప్పంద అధ్యాపకులు సాదు రాజేశ్, సతీష్, వీణ, ఆశీర్వాదం, అంజన్నరావు, గడ్డం కృష్ణ, ఆర్‌డీ ప్రసాద్, కే.మధుకర్‌రావు, భిక్షపతి, లక్ష్మారెడ్డి, సునీత, సుజాత, సంగీత్, కుమార్, బ్లెస్సీ, ప్రియాంక, శ్రీలత, సుచరితపాల్, సత్యజూల, సదాశివ, నాగేశ్వరరావు, తూర్పాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కాగా, కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు కూడా నిరసన చేపట్టారు.

ఆర్టీసీ లహరీ బస్సు బోల్తా

ఏడుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు

చింతగట్టు ఓఆర్ఆర్ వద్ద బోల్తా పడ్డ ఆర్టీసీ బస్సు

హసన్‌పర్తి, ఏప్రిల్ 8: రోడ్డు పనుల్లో ఉపయోగించే వాహనం ఢీకొట్టడంతో ఆర్టీసీ లహరీ బస్సు అదుపుతప్పి బోల్తా పడగా ఏడుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని చింతగట్టు వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. కేయూ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ డిపోకు చెందిన లహరి ఏసీ బస్సు ఆదిలాబాద్ నుంచి ఒంగోలుకు వెళ్లి తిరిగి సోమవారం 4.30 గంటలకు ఆదిలాబాద్‌కు బయల్దేరింది. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున హనుమకొండ బస్టాండ్‌లో ప్రయాణికులను ఎక్కించుకొని ఆదిలాబాద్‌కు వెళ్తూ సుమారు 3.30 గంటలకు చింతగట్టు ఓఆర్ఆర్ బ్రిడ్జి వద్ద చేరుకుంది. అదే సమయంలో బ్రిడ్జి వద్ద రోడ్డు పనులు చేసేందుకు ఉపయోగించే (మోటర్ గ్రేడర్ వెహికిల్) వాహనాన్ని డ్రైవర్ ఇండికేటర్, లైట్స్ వేయకుండా ఒక్కసారిగా రోడ్డు పైకి రివర్స్ తీశాడు. దీంతో ఆర్టీసీ బస్సు ముందు టైరును ఢీకొంది. వెంటనే బస్సు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న బత్తుల వెంకటేశ్, గంపాల శ్రీకాంత్, జాకీర్ హుస్సేన్, వోజ్జ కోటేశ్వర్‌రావు, మోజీ, కళ్లెం రత్నరాజు, మరో డ్రైవర్ మారంపెల్లి సుభాశ్‌చంద్రకు తీవ్రగాయాలయ్యాయి